ఉచిత డ్రైవింగ్ స్కూల్ ప్రారంభం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బాగ్‌లింగంపల్లిలో ఎలైట్ డ్రైవింగ్ స్కూల్ ఆధ్వర్యంలో కేశవ స్మృతి సంవర్థన సమితి, కేశవ నిలయం బర్కత్‌పుర ఆధ్వర్యంలో ఉచిత డ్రైవింగ్ స్కూల్ 12వ బ్యాచ్ ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ రవిచారి ముఖ్య అతిథిగా హాజరై ఉచిత డ్రైవింగ్ స్కూల్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎలైట్ డ్రైవింగ్ స్కూల్ ప్రొప్రైటర్ కె.ఉపేందర్, సమితి ప్రధాన కార్యదర్శి కొప్పారపు బాలయ్య, కోశాధికారి రామచంద్ర, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ సెక్యూరిటీ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కాచిగూడ: కేంద్ర ప్రభుత్వ ఆమోదిత నేషనల్ అకాడమీ ఆఫ్ సైబర్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో వివిధ సైబర్ సెక్యూరిటీ కోర్సుల్లో ఆన్‌లైన్ శిక్షణకు దరఖాస్తులు కోరుతున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ విమలా రెడ్డి తెలిపారు. శిక్షణ అనంతరం పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లు ప్రదానం చేస్తామన్నారు. కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులకు దేశ విదేశాలలో ఉత్తమ ఉపాధి అవకాశాలున్నట్లు తెలిపారు. వివరాలకు ఫోన్ నం.78931 41797.

విద్యారంగానికి బడ్జెట్‌లో 30శాతం నిధులు కేటాయించాలి

ముషీరాబాద్: బడ్జెట్‌లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని పీడీఎస్‌యూ తెలంగాణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొనగిరి మధు, పొడపంగి నాగరాజు డిమాండ్ చేశారు. విద్యానగర్‌లోని సీపీ భవన్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ... ఈనెల 23 నుంచి జరగబోయే తెలంగాణ అసెంబ్లీ సమావేశాలలో విద్యా రంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. విద్యారంగానికి పెద్దపీట వేస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సరిపడా నిధులు కేటాయించకుండా ఆ లక్ష్యాన్ని చేరలేదన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.ప్రణయ్, మంద నవీన్, కార్యవర్గ సభ్యుడు తీగల శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి

చిక్కడపల్లి: బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు దేవాలయాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ సంయుక్త కన్వీనర్ వినయ్‌కుమార్ జీహెచ్‌ఎంసీ అధికారులను కోరారు. ఆదివారం జీహెచ్‌ఎంసీ సిబ్బంది గాంధీనగర్ డివిజన్‌లోని ఆలయా పరిసరాలలో చేపడుతున్న మట్టికుప్పల తొలగింపు పనులను ఆయన పర్యవేక్షించి మాట్లాడారు. డివిజన్‌లోని ఆలయాల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కార్పొరేటర్ పావనీ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని ఆయన తెలిపారు.

మదర్సా పాఠశాలలను తెహ్రీక్ సంస్థకు అప్పగించాలి

కవాడిగూడ: మైనార్టీల సంక్షేమం కోసం ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని ఆలిండియా సూఫీ ఉల్మా కాంగ్రెస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు మైనార్టీల సమస్యలను పరిష్కరించాలని సూఫీ ఉల్మా కౌన్సిల్ ఆధ్వర్యంలో ఆదివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద నిరసన ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా పలువురు కౌన్సిల్ ప్రతినిధులు మాట్లాడుతూ.... ఇమామ్, మౌజామ్లా వేతనాలు పెంచాలన్నారు. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న మదర్సా పాఠశాలలను తెహ్రీక్ సంస్థలకు అప్పగించాలని కోరారు. మైనార్టీల సంక్షేమం ఆర్థిక అభివృద్ధికోసం తగిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మతపెద్దలు, పలువురు కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ అపర కర్మల భవనం ప్రారంభం

కాచిగూడ: శ్రీ రామానుజ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో హరాస్‌పెంట, కాచిగూడలో నూతనంగా ఏర్పాటు చేసిన బ్రాహ్మణ అపర కర్మల భవనాన్ని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... బ్రాహ్మణుల కోసం ప్రత్యేకంగా నిర్మించిన భవనంలో అపర కర్మలు చేసుకోవడానికి అన్ని వసతులు కల్పించామన్నారు. బ్రాహ్మణులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తన సొంత నిధులతో భవనాన్ని నిర్మించిన శ్రీమతి జయ, మోహన్‌రావు పోచంపల్లిని ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ ధనుంజయ్, హిందూ శ్మశానవాటిక ప్రబంధక సమితి అధ్యక్షుడు ఎస్.గోపాల్‌రావు, సీనియర్ కాంగ్రెస్ నేత బండసూరి, రాజ్‌కుమార్ విగ్ తదితరులు పాల్గొన్నారు.

తల్లీపిల్లల ఆచూకీ కనుగొని కుటుంబ సభ్యులకు అప్పగింత

చిక్కడపల్లి: గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయిన భార్యాపిల్లల ఆచూకీని చిక్కడపల్లి పోలీసులు కనుగొన్నారు. ఇన్‌స్పెక్టర్ సీతయ్య, ఎస్సై మౌనిక తెలిపిన వివరాల ప్రకారం.. చిక్కడపల్లి పీఎస్ పరిధిలో నివసించే పెండు ప్రవీణ్, భార్య పెండు అనూష తన పిల్లలు శ్రీ విద్య, అక్షితలను తీసుకొని ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోయింది. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. భార్యాపిల్లల ఆచూకీ కనుగొన్న పోలీసులు ఆదివారం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

నిరుద్యోగులపై ప్రభుత్వానిది కపట ప్రేమ

కాచిగూడ: నిరుద్యోగుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం కపట ప్రేమను చూపిస్తోందని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ విమర్శించారు. అసెంబ్లీ సమావేశాలను నిరుద్యోగులు అడ్డుకుంటారనే ఉద్దేశంతోనే గ్రూప్ 2 పరీక్షలను వాయిదా వేసిందన్నారు. అంతేగాని నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలనే చిత్తశుద్ధి ప్రభుత్వానికి ఏమాత్రం లేదన్నారు. నిరుద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకుంటే అసెంబ్లీని ముట్టడిస్తామని ఆయన ఒక ప్రకటనలో హెచ్చరించారు.

నల్లపోచమ్మకు వేయికళ్ల తొలి బోనం



బాకారం నల్లపోచమ్మకు బోనాన్ని సమర్పిస్తున్న భక్తులు

రాంనగర్ డివిజన్ బాకారంలోని కుమ్మరి సంఘం నుంచి వేయికళ్ల తొలి బోనాన్ని నాగరాజులావణ్య ఆధ్వర్యంలో బాకారంలోని నల్లపోచమ్మకు సమర్పించారు. ఈ కార్యక్రమంలో పోచమ్మ దేవాలయ చైర్మన్ పులి సందీప్‌గౌడ్, బాబురావు, విజ్జురావు, అనిల్‌యాదవ్, అంజిరెడ్డి, మహేష్‌గౌడ్, సురేష్‌కుమార్, రమేష్‌యాదవ్, ప్రవీణ్‌రెడ్డి, సురేందర్‌రావు, శివ, రాముగౌడ్, వెంకట్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

– ముషీరాబాద్

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి



బాగ్‌అంబర్‌పేట సాయిబాబ ఆలయంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ దంపతులు



చుక్కా రామయ్యకు గురు సత్కారం చేస్తున్న హనుమాన్ దేవాలయం ఈవో శ్రీనివాస రాజు





డీడీ కాలనీలోని సాయిబాబా ఆలయంలో కార్పొరేటర్ బీ.పద్మావెంకట్‌రెడ్డి దంపతులు

గురుపౌర్ణమి వేడుకలు ఆదివారం అంబర్‌పేట, ముషీరాబాద్ నియోజకవర్గాల్లో వైభవంగా జరిగాయి. సాయిబాబా దేవాలయలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారు జామునుంచే భక్తులు ఆలయాలకు పెద్ద ఎత్తున తరలివచ్చి బాబాను దర్శించుకున్నారు. ఆదివారం కావడంతో భక్తులు కుటుంబ సమేతంగా ఆలయాలను సందర్శించి సాయిబాబాకు విశేష పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయాల అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

– అంబర్‌పేట/ముషీరాబాద్ జోన్ బృందం

- భక్తులతో కిటకిటలాడిన దేవాలయాలు
- ప్రముఖ విద్యావేత్త చుక్కా రామయ్యకు గురు సత్కారం

◆ బాగ్ అంబర్‌పేటలోని శ్రీ షిరిడీ సాయిబాబా మందిరంలో ఉదయం 5 గంటలకు నగర సంకీర్తనతో వేడుకలు ప్రారంభమయ్యాయి. అనంతరం బాబాకు కాకడ హారతి, మంగళ స్నానం, అర్చన, గణపతి పూజ, పుణ్యాహవాచనం, రక్షబంధనం, మండపారాధన, ఏకాదశ కలశ స్థాపనాపూర్వక అభిషేకం, సాయి గాయత్రి హోమం, పూర్ణాహుతి నిర్వహించారు.

◆ 11 గంటలకు బాబాకు కలశోదకాలతో అభిషేకం, మధ్యాహ్న హారతి అనంతరం సుమారు రెండు వేల మంది భక్తులకు నారాయణ సేవా(అన్నదానం) చేశారు. అలాగే సాయంత్రం 6.30 గంటలకు ధూప్ హారతి, పల్లకీ సేవ, భజన, ఊయల సేవ కావించారు. సేజ్ హారతితో వేడుకలు ముగిసాయి.

◆ కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, ఆయన సతీమణి కాలేరు పద్మతో కలిసి బాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి, ఎమ్మెల్యే దంపతులను సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ ప్రతినిధులు శాలువాతో సన్మానించి ప్రసాదం అందజేశారు.

◆ సనత్‌నగర్‌లోని హనుమాన్ దేవాలయం ఈవో శ్రీనివాస రాజు, ప్రధాన అర్చకులు రవీంద్రాచార్యులు, అర్చకులు ఫణీంద్ర శర్మ, ఆలయ సిబ్బందితో కలిసి నల్లకుంట విజ్ఞాన్‌పురి కాలనిలో ప్రముఖ విద్యావేత్త ఐఐటీ రామయ్య నివాసానికి విచ్చేసి ఆయనను శాలువాతో సన్మానించి గురు సత్కారం చేసి వేద ఆశీర్వచనం ఇచ్చారు.

◆ గురు సత్కారం

గురు పౌర్ణమిని పురస్కరించుకొని ఆదివారం నల్లకుంట శివం సిండికేట్ బ్యాంక్ సమీపంలోని శ్రీసరస్వతి సంగీత విద్యాలయంలో గురు వందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సంగీత విద్యాలయం ప్రిన్సిపాల్, పంచశత వీణా గాన రత్న పోపూరి శ్రీనివాస శర్మకు సంగీత విద్యార్థులు నూతన వస్త్రాలు అందజేసి శాలవాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంగీత విద్యాలయం సంగీత ఉపాధ్యాయులు తేజస్విని, యశస్విని, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు.. అన్నదానాలు

ముషీరాబాద్ నియోజకవర్గంలో ఆదివారం గురు పౌర్ణమి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వాడవాడల అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. గౌరీ శంకర్ ఆలయ కమిటీ చైర్మన్ పి.శ్రీధర్‌చారి ఆధ్వర్యంలో ప్రత్యేకంగా తయారు చేసిన సాయిబాబా విగ్రహానికి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ కార్యదర్శి ఎడ్ల హరిబాబుయాదవ్, భోలక్‌పూర్, గాంధీనగర్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షులు వై.శ్రీనివాసరావు, రాకేష్‌కుమార్, నాయకులు డి.శివముదిరాజ్, సంగిశెట్టి రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాపూజీనగర్‌లో...

బాపూజీనగర్‌లో కాంగ్రెస్ నగర నాయకులు ఆర్.ఎల్.రమేష్ ఆధ్వర్యంలో గురు పౌర్ణమి పూజలు నిర్వమించారు. ఈ సందర్భంగా స్వామి వారికి పూజలు చేసి అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు జగదీష్, శ్రీనివాస్‌యాదవ్, తేజగౌడ్, శివముదిరాజ్, అజయ్ పాల్గొన్నారు.

సంజీవయ్యనగర్‌లో ఎమ్మెల్యే పూజలు..

భోలక్‌పూర్ డివిజన్‌లోని సంజీవయ్యనగర్‌లో గల ప్రసిద్ధిగాంచిన సాయిబాబా దేవాలయంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్ పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యువజన కమిటి సీనియర్ నాయకులు ముఠా జైసింహ, భోలక్‌పూర్ అధ్యక్షుడు వై.శ్రీనివాసరావు, నాయకులు ప్రవీణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని సన్మానిస్తున్న సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ ప్రతినిధులు



రాంనగర్ రామాలయంలో జరిగిన పూజలో ఎమ్మెల్యే ముఠా గోపాల్



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న రామాలయ కమిటీ చైర్మన్ రవియాదవ్



అడిక్‌మెట్ సాయిబాబా దేవాలయంలో రాంనగర్ మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి



బాగ్‌లింగంపల్లిలోని బాబా ఆలయంలో టీఎస్ పీసీసీ లీగల్ సెల్ కన్వీనర్ రాజేంద్రప్రసాద్‌గౌడ్



జెమినికాలనీలోని బాబా ఆలయంలో రాజ్యసభ సభ్యులు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్



ముషీరాబాద్ శివాలయం వద్ద పూజలు నిర్వహిస్తున్న శ్రీధర్‌చారి, శివముదిరాజ్



బాపూజీనగర్‌లో అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు ఆర్‌ఎల్ రమేష్



వైఎస్సార్ పార్కు సాయిబాబా ఆలయం వద్ద అన్నదానం చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

బీసీలకు రూ.2లక్షల కోట్లు కేటాయించాలి

రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య

ముషీరాబాద్: వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశపెట్టనున్న కేంద్ర బడ్జెట్‌లో బీసీలకు రూ.2లక్షల కోట్లు కేటాయించాలని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని బీసీ భవన్‌లో 14 బీసీ సంఘాల ప్రతినిధులు సమావేశమై ప్రధానమంత్రికి లేఖ రాశారు. ఈ సమావేశంలో ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ... బీసీల ఉద్యోగ, ఆర్థిక, సామాజిక అభివృద్ధికి రూ.2లక్షల కోట్ల బడ్జెట్ కేటాయించాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం బీసీల అభివృద్ధికి బడ్జెట్ కేటాయించకుండా అన్యాయం చేస్తుందని ఆరోపించారు. కేంద్ర బడ్జెట్‌లో 45 లక్షల 90 వేల కోట్లు రూపాయిలు కేటాయిస్తే అందులో బీసీలకే రూ.2వేల కోట్లు కేటాయిస్తే ఏమి సరిపోతుందని ప్రశ్నించారు.

◆ మండల కమిషన్ సిఫారస్సుల ప్రకారం కేంద్ర ఉద్యోగాల్లో, విద్యా సంస్థల్లో రిజర్వేషన్లు అమలు చేసి మూడు దశాబ్దాలు అయ్యిందన్నారు. అయినా ఇప్పటికీ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రియింబర్స్‌మెంట్ స్కీమ్‌లు ప్రారంభించడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న స్కీమ్‌లకు 60 శాతం మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వడం లేదన్నారు. గత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమ్మ ఒడి పథకం కింద ప్రతి ఒక్కరికి సంవత్సరానికి రూ.15వేల స్కాలర్‌షిప్ ఇచ్చిందన్నారు. కాలేజీ విద్యార్థులకు సంవత్సరానికి రూ.20వేల స్కాలర్‌షిప్‌లు ఇచ్చిందని తెలిపారు. కానీ వీరికి మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వడం లేదన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సత్యానారాయణ, రాజేందర్, అనంతయ్య, నందగోపాల్, వేముల రామకృష్ణ, పగిళ్ల సతీష్, రవీందర్, నిఖిల్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.



బీసీ భవన్‌లో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

ఎస్సై మృతి కారకులను వెంటనే అరెస్ట్ చేయాలి

దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్




సమావేశంలో మాట్లాడుతున్న వడ్లమూరి కృష్ణస్వరూప్

కాచిగూడ: అశ్వారావుపేట దళిత ఎస్సై శ్రీరాముల శ్రీను మృతికి కారణమైన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జితేందర్‌రెడ్డి, ఇతర పోలీస్ సిబ్బందిని వెంటనే అరెస్ట్ చేసి వారిని సర్వీస్ నుంచి తొలగించాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నారాయణగూడలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఘటనపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ, రాష్ట్ర డీజీపీలపైన చర్యలు తీసుకోవాలన్నారు. తెలంగాణ పోలీస్ విభాగంలో దళిత అధికారులపైన ఆధిపత్య కులాల అధికారులు కుల వివక్షత, వేధింపులకు పాల్పడుతున్నారని అన్నారు. అందులో భాగంగానే దళిత ఎస్సై శ్రీరాముల శ్రీనుపై దాడి జరిగిందన్నారు.

◆ ఈ ఘటనలోని నిందితులకు ఆ జిల్లా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డి కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. 22 రోజులు గడుస్తున్నా నిందితులను ఇంత వరకు అరెస్ట్ చేయలేదన్నారు. నిందితులను రక్షించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. ఈ దారుణ ఘటనపై తెలంగాణ పోలీస్ శాఖలో ఎస్సీ, ఎస్టీ సిబ్బంది స్పందించాలన్నారు. ఈ ఘటనపైన జాతీయ ఎస్సీ కమిషన్, జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్మన్‌లకు తమ పార్టీ తరపున ఫిర్యాదు చేశామన్నారు. కుల వేధింపులకు పాల్పడిన పోలీసులను అరెస్ట్ చేయకపోతే న్యాయ పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ గోలి నరేష్, బి.రమేష్, బీరం సంతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ కులస్తులను బీసీ–ఏలో చేర్చాలి

కాచిగూడ: ముదిరాజ్ కులస్తులను బీసీ (డీ) నుంచి బీసీ (ఏ)లో చేర్చాలని అఖిల భారత ముదిరాజ్ సంఘం (ఏబీఎంఎస్) జాతీయ అధ్యక్షుడు పొట్లకాయల వెంకటేశ్వర్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. ఏబీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడిగా ప్రేమ్ విమల్ ముదిరాజ్‌ను నియమిస్తూ ఆదివారం ఆయనకు నియామకపు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముదిరాజ్‌లు ఐకమత్యంతో హక్కుల సాధన కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ముదిరాజ్ కులస్తులు బీసీ (డీ) కేటగిరిలో ఉన్నందున అన్ని విధాలా వెనుకబడి పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముదిరాజ్‌లు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని తెలిపారు. ప్రభుత్వం ముదిరాజ్ కులస్తులను పట్టించుకోవడం లేదన్నారు. తెలంగాణ రాష్ట్రంతో పాటు గ్రేటర్ పరిధిలో ఉన్న ముదిరాజ్‌లను ఏకతాటిపై తీసుకురావడానికి కార్యాచరణ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.



ప్రేమ్‌విమల్ ముదిరాజ్‌కు నియామక పత్రం అందజేస్తున్న వెంకటేశ్వర్‌ముదిరాజ్

బర్కత్‌పుర డీఎంగా మంజుల



కాచిగూడ: బర్కత్‌పుర డిపో మేనేజర్‌గా మంజుల ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు డిపో మేనేజర్‌గా పనిచేసిన వేణుగోపాల్ బదిలీపై ఆర్టీసీ హెడ్ ఆఫీస్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా మంజుల మాట్లాడుతూ... డిపో సిబ్బంది, డ్రైవర్, కండక్టర్లు అందరి సమన్వయంతో పనిచేస్తూ ప్రయాణికులకు మెరుగైనా బస్సు రవాణాను అందించే విధంగా కృషి చేస్తానని అన్నారు.

సన్మానం



సుందరయ్యవిజ్ఞానకేంద్రం: రంగారెడ్డి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ రజతోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం ఆధ్యాత్మికవేత్త, యోగా గురువు డా. చిక్క దేవదాస్‌ను ఘనంగా సన్మానించారు. చిక్క దేవదాసు మాట్లాడుతూ.. బ్యాంకును అభివృద్ధి పథంలో నడిపిస్తున్న కోఆపరేటివ్ కార్యవర్గాన్ని ఆయన కోనియాడారు. ఈ కార్యక్రమంలో కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ బచ్చు బద్రినాథ్‌నారాయణ, డైరెక్టర్ కె.కృష్ణయ్య, ఎన్.సత్యం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొట్టడంతో వ్యక్తి మృతి

కాచిగూడ: రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... బిహార్ రాష్ట్రానికి చెందిన కమలేష్ కుమార్ సింగ్ (50) నగరంలోని ఆరాంఘర్‌లో ఉంటూ ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. బుద్వేల్–శివరాంపల్లి రైల్వే స్టేషన్ల మధ్య పట్టాల వెంట నడుచుకుంటూ వెళ్తుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను పెంచాలి

కాచిగూడ: స్థానిక సంస్థలలో బీసీ రిజర్వేషన్లను పెంచేందుకు కార్యాచరణ ప్రణాళికను వేగవంతం చేయాలని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బీసీ దళ్ ఆధ్వర్యంలో ప్రతినిధులు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆదివారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా దుండ్ర కుమారస్వామి మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ చేస్తున్న కృషి ప్రశంసనీయమని అన్నారు. బీసీలకు మంచి చేయడానికి సీఎం ముందుకు రావడం శుభపరిణామమని.. అందుకు మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన కృషి ఎనలేనిదని అన్నారు.

◆ పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్ల అమలు, రాబోయే ఎన్నికలలో వాటి పెంపుకు సంబంధించిన వివరాలపై సీఎం అధికారులతో సమీక్ష చేశారని తెలిపారు. ఇప్పుడైనా బీసీలకు న్యాయం చేసేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. ఇప్పటికే రూ.2లక్షల వరకు రైతులకు రుణమాఫీ చేసి ప్రశంసలు అందుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నిల్లో బీసీలకు రిజర్వేషన్లు పెంచుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు.



మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతి పత్రం అందజేస్తున్న దుండ్ర కుమారస్వామి

స్వామి వివేకానంద స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం



బాగ్‌లింగంపల్లిలో హోమియోపతి వైద్యశాలను ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: స్వామి వివేకానంద స్ఫూర్తితో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలో వివేకానంద కేంద్ర కన్యాకుమారి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత హోమియో వైద్యశాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ.. 'మానవ సేవే.. మాధవ సేవ'అనే నినాదంతో ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలన్నారు. పేదలకు ఉచితంగా ఆరోగ్య సేవలు అందించడం హర్షణీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్రం నిర్వాహకులు కోవేల శ్రీనివాసరంగ చార్యులు, రాంనగర్ కార్పొరేటర్ కె.రవిచారి, నాయకులు సి.పార్థసారథి, అరుణ్, జైపాల్‌రెడ్డి, హోమియోపతి వైద్యుడు ఆర్‌వీ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కవాడిగూడ డివిజన్‌లో వైభవంగా బోనాలు

కవాడిగూడ: లోయర్ ట్యాంక్‌బండ్‌లోని మున్సిపల్ గ్యారేజీలో స్వచ్ఛ గ్రేటర్ హైదరాబాద్ తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బోనాల వేడుకలు ఘనంగా జరిగాయి. యూనియన్ అధ్యక్షుడు బండారి యాదగిరి ఆధ్వర్యంలో జరిగిన బోనాల వేడుకలకు ఎంపీలు డాక్టర్ కె.లక్ష్మణ్, ఎం.అనిల్‌కుమార్ యాదవ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, కవాడిగూడ డివిజన్ కార్పొరేటర్ జి. రచనశ్రీలు హాజరై మున్సిపల్ గ్యారేజీలో ఉన్న అమ్మవారి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆలయంలో పూజలు నిర్వహించిన ప్రజాప్రతినిధులను నిర్వాహకులు బండారి యాదగిరి శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు నర్సింగ్‌రావు, బి.బాబు, రాజ్, నర్సింగ్, యాదగిరి, అనిల్, బీఆర్‌ఎస్ నాయకులు ముఠా జైసింహ, టి.రవిందర్, బీజేపీ నాయకులు పూసరాజు, జి. వెంకటేష్, పరిమళ్‌కుమార్ పాల్గొన్నారు.

తాళ్లబస్తీలో వైభవంగా బోనాలు...

కవాడిగూడ డివిజన్ తాళ్లబస్తీలో బోనాల వేడుకలు వైభవంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచే ఆలయానికి భక్తులు తరలివచ్చి ఒడి బియ్యం, బోనాలు, సాకలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి రవకు తొట్టెల ఊరేగింపు, బోనాలతో వచ్చి భక్తులు అమ్మవార్లకు తమ మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ నిర్వాహకులు ఏర్పాటు చేశారు. ఈ ఉత్సవాలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గాంధీనగర్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



మున్సిపల్ గ్యారేజీలో జరిగిన బోనాల వేడుకల్లో ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, కార్పొరేటర్ జి.రచనశ్రీ